క్లుప్తంగా

డ్రమ్‌సీడర్‌పై అవగాహన



కొల్లాపూర్: మండలంలోని అంకిరావుపల్లిలో సోమవారం ఏఓ చిన్న హుస్సేన్ యాదవ్ రైతులతో సమావేశం అయ్యారు. వరినాటులో డ్రమ్ సీడర్ విధానం గూర్చి అవగాహన కల్పించారు. డ్రమ్ సీడర్‌లో వరినాటే విధానాన్ని చూపించారు. ప్రయోజనాలను, వరిసాగులో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాల సేకరణ అంశాలను తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సూర్యతేజ, మోనిక, శిరీష తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం



అచ్చంపేట: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు సీబీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన మధ్యాహ్న భోజనాన్ని చైర్మన్ డాక్టర్ చిక్కుడు అనురాధ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అంతటి రజిత, కౌన్సిలర్ గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

అచ్చంపేట(ఉప్పునుంతల): మండలంలోని వెల్టూరులో రథసప్తమి పండుగను పురస్కరించుకొని సోమవారం గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ లింగమయ్య, గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, రమేష్, హర్షవర్ధన్‌రెడ్డి, బాలరాజు, రాంబాబు, నిరంజన్, నిర్వాహకులు ఎండీ సమ్మద్, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధానికి తీర్మానం

అచ్చంపేట(ఉప్పునుంతల): మండలంలోని కాంసానిపల్లిలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని గ్రామస్తులు, యువకులు తీర్మానం చేశారు. మద్యం అమ్మినవారికి రూ. 15 వేలు జరిమానా విధించడంతోపాటు కొనుగోలు చేసిన వారికి రూ. 10 వేలు, పట్టించినవారికి రూ. 5వేలు బహుమతి ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామంలో చాటింపు వేయడంతోపాటు షాపుల యజమానులకు మద్యం అమ్మకూడదని తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

అచ్చంపేట(అచ్చంపేట రూరల్): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

15న అధికారిక సెలవు ప్రకటించాలి

అచ్చంపేట(అచ్చంపేట రూరల్): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజు జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవుదినంగా ప్రకటించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడావత్ రాంబాబునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం అచ్చంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బంజారా జాతిని చైతన్య పరిచి జీవితాలలో మార్పు తీసుకొచ్చిన మహానుభావుడు సంత్ సేవాలాల్ అని కొనియాడారు.

తైక్వాండో పోటీల్లో మూడో స్థానం

పెంట్లవెల్లి: తైక్వాండో ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో పెంట్లవెల్లి గ్రామానికి చెందిన మహమ్మద్‌హర్షద్ జాతీయ స్థాయి లో సత్తా చాటి మూడవ స్థానంలో నిలిచాడు. హైదరాబాద్‌లోని యూసూఫ్‌గూడ ఇండోర్ స్టేడియంలో గత నెల 27 తేదీ నుంచి 30 వ తేదీ వరకు నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చి మెడల్ సాధించారు. సోమవారం మహమ్మద్‌హర్షద్‌ను, కోచ్ రామకృష్ణను గ్రామస్తులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్లాపూర్(కోడేరు): మండలంలోని నర్సాయిపల్లికి చెందిన ఎజ్జు కుర్మయ్య(50) వారం రోజుల కిందట విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య శేషమ్మ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



సిద్ధార్థ మోడల్ పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లులు ఉపాధ్యాయులు



పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహిస్తున్న ఆ సంఘం సభ్యులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో ఏవీఓపీఏ ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య పెద్దలు, వాసవీ వనిత క్లబ్ సభ్యులు కలిసి చిన్నపిల్లలకు అక్షరాభ్యాసాన్ని చేయించి సరస్వతి మాతకు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ అవోపా కార్యదర్శి సోమిశెట్టి ప్రదీప్ కుమార్, సందీప్, భాస్కర్, రాజు, శ్రీలత, రాధిక, సుప్రియ, శ్రీదేవి, రాధ, భార్గవి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. వసంత పంచమి విశిష్టత గురించి తెలుగు పండితులు రేణుక, ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ విద్యార్థులకు వివరించారు. చిన్నముద్దునూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అలివేలు మంగ, చిన్నారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా జ్ఞాన సరస్వతి దేవాలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 265 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నవీన్‌కుమార్‌శర్మ, ఆలయ అధ్యక్షుడు ఆకారపు విశ్వనాథం, ఈశ్వరయ్య, శివశంకర్, దొడ్ల నారాయణ రెడ్డి, దొడ్ల ఇందుమతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఆలయ పూజారులు

విద్యాశాఖలో ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న జంగయ్య

కొల్లాపూర్: విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, విద్యా విషయక అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జంగయ్యతో పాటు, రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. విద్యాశాఖలో పర్యవేక్షణ కోసం ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజన మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బిల్లులతో పాటు, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల బిల్లులను త్వరితగతిన చెల్లించాలన్నారు. పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. సదస్సులో ఎంఈఓ ఇమ్మానుయేల్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి యం.శ్రీధర్ నాయకులు శంకర్, చిన్నయ్య, తిరుపతయ్య, రమాదేవి, లలితాబాయి, చంద్రశేఖర్, మహేష్‌బాబు, లక్ష్మణ్, లింగమయ్య ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నాయకుల నిరసన

కొల్లాపూర్(కోడేరు): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 8వ సారి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా ఉందని సోమవారం సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ్మ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రూ.2.50 కోట్లు అవసరం కాగా కేవలం రూ. 86 కోట్లు మాత్రమే కేటాయించడంతో పేదల వ్యతిరేక ప్రభుత్వంమా మరోసారి రుజువైందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రవి, మాజీ ఉప సర్పంచ్ కాటం లక్ష్మయ్య, డీవైఎస్ఐ మండల అధ్యక్షుడు శేఖర్, శ్రీశైలం, రాములు, నర్సింహ్మ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

కొల్లాపూర్(పెంట్లవెల్లి): కేంద్ర మంత్రి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు. కార్యక్రమంలో హన్మంతు, శ్రీనివాసులు, తిమ్మస్వామి, రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్

ఉప్పునుంతలలో..

అచ్చంపేట(ఉప్పునుంతల): మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు పాల్గొన్నారు. తిర్పతయ్య, హమాలీ కార్మిక సంఘం నాయకులు అర్జునయ్య, బొబ్బిలయ్య, వెంకటయ్య, రీంబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం



కందనూలు: ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో సోమవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో సీఎం చిత్రపటానికి మాదిగ జేఏసీ నాయకులు పాలాభిషేకం చేశారు. వంగూరి జయశంకర్, పోలే భాస్కర్ మాదిగ, ఫకీర రాము, చంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

కల్వకుర్తి(చారకొండ): మండలంలోని గోకారం, జేపల్లి, బమ్మల గుడిసేల గ్రామాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవార జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఏఓ చంద్రశేకర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ సీతారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్‌ను కలిసి సమస్యను వివరించారు. శంకర్, రమేష్, నాగర్జున, రాకేష్, గణేష్, మల్లేష్, యాదగిరి, కవిత తదితరులు ఉన్నారు.

వైఆర్‌జీకేర్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్



తెలకపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వైఆర్‌జీకేర్ ఆధ్వర్యంలో సోమవారం హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. 200 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ రామకృష్ణ, మండల లింకు వర్కర్ భాస్కర్, వివిధ క్లస్టర్ల లింక్ వర్కర్లు శ్రీశైలం, చంద్రకళ, హేమలత పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహాలకు ప్రాణఃప్రతిష్ఠ

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని నంది వడ్డెమాన్‌లో పునర్నిర్మాణం చేసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో 5వ తేదీ నుంచి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేయనునట్లు నిర్వాహకులు తెలిపారు. రూ. 2 కోట్లకు పైగా వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి నందకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు పెద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

కొల్లాపూర్(కోడేరు): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన పిట్టల సుధాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. 2011–12 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి మిత్రులు కలిసి బాధిత కుటుంబానికి రూ.21వేలు ఆర్థికసాయం చేశారు. రాములు, మహేష్, పరమేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలాలో లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాదం పంపిణీ చేశారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుదాం

కల్వకుర్తి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌గౌడ్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండలంలోని జిల్లెల్లలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రాచకొండ ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా నాప శివసేన కురుమ, ఉపాధ్యక్షులుగా నాప బిక్షపతి, ఎముక రామకృష్ణ, కార్యదర్శులుగా ఆంజనేయులు, మల్లేష్, శివ, నరేష్, అంజి సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా కొప్పుల శివశంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నాగరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో వెలసిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో రథోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. వేకువజామున ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. నాయకులు, గ్రామస్తులు, యువకులు, భక్తులు ఉన్నారు.

సూర్యదేవాలయంలో హోమాలు



నాగర్‌కర్నూల్(తాడూరు): మండలంలోని బలాన్‌పల్లిలో సోమవారం సూర్యదేవాలయ వార్షికోత్సవ సందర్భంగా మొదటిరోజు భక్తిశ్రద్ధలతో హోమాలు, యజ్ఞాలు భగవద్గీత పారాయణం, ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మరో భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కబడ్డీ జిల్లా సెక్రటరీని తొలగించాలని వినతి

నాగర్‌కర్నూల్: కబడ్డీ జిల్లా సెక్రెటరీ యాదయ్య గౌడ్‌ను తొలగించాలని చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమ వారం అదనపు కలెక్టర్ అమరేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అనర్హులను ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేశారని వివరించారు. ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కల్వకుర్తి(వెల్దండ): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో హైదరాబాద్ –శ్రీశైలం ప్రధాన రహదారిపై బొలేరో, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సోమవారం వంగూర్ మండలం కొండారెడ్డి పల్లి గ్రామానికి చెందిన అలివేలు భర్తతో పాటు కుమార్తెతో ఆమనగల్లు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మార్గమధ్యలో వెల్దండ సమీపంలో వెనుక నుంచి కల్వకుర్తి నుంచి హైదరాబాదు వెళ్తున్న బొలేరా వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అలివేలుతో భర్త, కుమార్తెకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ: ముగ్గురిపై కేసు నమోదు

కల్వకుర్తి(వెల్దండ): ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నగారగడ్డతండాకు చెందిన రాత్లవత్ నరేష్ సోదరుడితో గొడవపడ్డాడు. ఒకరికొకరు తోసుకోవడంతో ఆవేశంలో సోదరుడితో పాటు కుటుంబసభ్యులు నరేష్‌పై దాడి చేశారు. ఈ దాడిలో నరేష్‌కు గాయాలయ్యాయి. అన్న శ్రీను, సోని, రమేష్ లపై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

వాల్‌పోస్టర్ విడుదల

సాక్షి, నెట్‌వర్క్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం విడుదల చేశారు. తెలకపల్లి మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము ఆనంద్, ఉదయ్ కుమార్, రెడ్డపాకుల రమేష్, తిమ్మాజిపేట మండలం అంబేడ్కర్ విగ్రహం ఎదుట జిల్లా నాయకులు జోగు ప్రదీప్, దానం జగన్‌రాజ్, దానం బాల్‌రాజ్, కొల్లాపూర్ మండలంలోని చింతలపల్లి, చౌటబెట్ల గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బచ్చలకూర లక్ష్మణ్, వెల్దండలో మండల ఇన్‌చార్జ్ టి. రాజు విడుదల చేశారు. మాదిగల ఐక్యవేదిక మండల ఉపాధ్యక్షుడు వెంకటయ్యలు వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మార్పీఎస్ మాదిగ ఉద్యోగుల ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పాలమూరు చౌరస్తా వరకు డప్పులతో కదం తొక్కారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్ష డప్పులు వెయ్యి గొంతుకల పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ ఆవిష్కరించారు.



తెలకపల్లిలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



డప్పులు కొడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణాజీ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వసంతాపూర్‌లో మిర్చి రైతుల కల్లాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. రైతులు భగవాన్‌రెడ్డి, శ్రీశైలం, ఎల్లమ్మ, పార్వతమ్మ, తదితరులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కృష్ణాజీ

బైపాస్ నిర్మాణానికి సహకరించాలి

కల్వకుర్తి(చారకొండ): జడ్చర్ల –కోదాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు, చేపడుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణం పనులకు బాధితులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ సునీత కోరారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులకు 24 మందికి నష్టపరిహారం ఇచ్చామన్నారు. మిగతా ఆరుగురికి కూడా చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు.

ఆదివాసీ చెంచుల హక్కులు హరిస్తే సహించం

అచ్చంపేట(మన్ననూర్): ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ చెంచుల హక్కులను హరిస్తూ సంహించే ప్రసక్తే లేదని చెంచు సేవా సంఘం నాయకులు శ్రీనివాసులు, శంకరయ్య, రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. మన్ననూర్ గ్రామం శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో నిజాం పాలకుల కాలంలో మనుగడలో ఉన్న కాలపాని జైలు శిథిలం కావడంతో అదే స్థానంలో భవనం పునర్నిర్మాణం చేసి పండిట్ నరేందర్‌జీ స్మారక భవనం అని పేరు పెట్టారన్నారు. ఈ భవనంలో గిరిజన పాఠశాల విద్యార్థులకు తరగతి గదులుగా, ఆయుర్వేద ఆస్పత్రిగా కొంత కాలం పాటు కొనసాగించారని వివరించారు. అప్పుడప్పుడు ఆర్య సమాజ్ వారు భవనం ఎదుట ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ అక్కడ ఉన్న ఖాళీ స్థలాన్ని మొత్తంగా స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసి చెంచుల అభివృద్ధి కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేవిధంగా ఆరు నెలల కిందట కాలపాని ఎదుట రాష్ట్ర గిరిజన కమిషనర్ శరత్, గత నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్ కుమార్‌లు పరిశీలించారని తెలిపారు. కాలపాని ఎదుట ఉన్న స్థలాన్ని ఆర్యసమాజ్‌కు చెందిన వారు స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తూ చూస్తూ ఊరుకోమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని రెవెన్యూ స్థలాన్ని చెంచులకే దక్కాలని డిమాండ్ చేస్తున్నారు.

నర్సరీల పరిశీలన

నాగర్కర్నూల్(తాడూరు): మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి నర్సరీలను ఎంపీడీఓ ఆంజనేయులుయ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



అప్పాయపల్లిలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది

లింగాల: మండలంలోని లింగాల, అప్పాయపల్లిలో సారా తయారీ కేంద్రాలపై సోమవారం ఎక్సైజ్ శాఖ వారు దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని మరో 150 లీటర్ల బెల్లం ఊటకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జనార్ధన్ తెలిపారు. అప్పాయపల్లికి చెందిన మూడావత్ బొజ్జి, ఎరుకలి నారమ్మపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్, నాగర్‌కర్నూల్ ఎస్‌హెచ్ఓ బృందం పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లికి చెందిన శ్రీనివాసులు మద్యం తాగి వాహనం నడుపుతుండగా డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు అయ్యిందని ఎస్ఐ నాగరాజు తెలిపారు. సోమవారం అచ్చంపేట కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా గ్రంథాలయానికి కపిలవాయి పేరు పెట్టాలి



వినతి పత్రం అందజేస్తున్న కవులు

నాగర్‌కర్నూల్: జిల్లా గ్రంథాలయ భవనానికి ప్రముఖ కవి, శతాధిక గ్రంథకర్త కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని గ్రంథాలయ జిల్లా చైర్మన్ రాజేందర్‌కు సోమవారం పలువురు కవులు వినతిపత్రం సమర్పించారు. వెన్నెల సాహిత్య అకాడమీ నెలపొడపు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో ఆయన చాంబర్‌లో అధ్యక్షుడు ముచ్చర్ల దినకర్, నెలపొడపు సాహిత్య వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, సీనియర్ జర్నలిస్ట్ కందికొండ మోహన్, సామాజిక ఉద్యమకారులు కవి ఎదిరెపల్లి కాశన్న, లింగమూర్తి కుమారుడు కపిలవాయి అశోక్ బాబులు చైర్మన్‌ను కలిశారు. లింగమూర్తి రచించిన పుస్తకాలను చైర్మన్‌కు అందించారు. చైర్మన్ స్పందిస్తూ రాష్ట్ర గ్రంథాలయ శాఖ చైర్మన్‌కు సంబంధిత శాఖ అధికారులకు వినతిపత్రం పంపిస్తామని, రేపు జరగబోయే జనరల్ బాడీ సమావేశంలో ఈ అంశంపై తీర్మానించి పంపిస్తామన్నారు. గ్రంథాలయానికి కపిలవాయి పేరు పెట్టేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం



ఓటరు జాబితాలను సరి చేస్తున్న కార్యదర్శులు

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్న సందర్భంగా మండల అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయానికి నామినేషన్లకు సంబంధించి పత్రాలు, గైడ్ లైన్సు తెలిపే బుక్‌లెట్‌లు చేరుకోవడంతో వాటిని సరి చేసుకున్నారు. సోమవారం గ్రామ పంచాయతీలలో వార్డుల వారిగా ఓటరు జాబితాలను సిద్ధం చేసుకుంటున్నారు.

బీఎస్పీ నాయకుల పరామర్శ

కందనూలు: జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్నామని కొందరు రైతులు ఆత్మహత్యయత్నానికి పాల్పడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం తాడూరుకు చెందిన రైతులు చింత కురుమూర్తి, మంచాల శేఖర్‌లను బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ బాధితులను పరామర్శించారు. పృథ్వీ, కల్యాణ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

కల్వకుర్తి(వెల్దండ): జాతీయ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఆర్‌పీ బద్రునాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023–2024 సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనులపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృందం, కార్యదర్శులు, ఉపాధి సిబ్బదికి సమన్వయంతో తనిఖీ చేస్తారు. ఈనెల5వ తేది నుంచి గ్రామాల్లో తనిఖీ బృందం వెళ్తున్నట్లు తెలిపారు. మండలానికి 15 మంది డీఆర్‌పీలు వచ్చినట్లు తెలిపారు. ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడు, ఆయా గ్రామాల కార్యదర్శులు, టీఏలు తదితరులు ఉన్నారు.